కథలు

# విముక్త



ఓల్గా

ఓల్గా కథలు

విముక్త

# విముక్త

కథలు



ఓల్గా

స్వేచ్ఛ ప్రచురణలు
హైదరాబాద్

Vimuktha
stories by volga

**విముక్త (కథలు)**

**ఓల్గా**

ముద్రణ : జూలై 2010

ముఖ చిత్రం : కిరణ్‌కుమారి

డిజైనింగ్, బుక్ మేకింగ్ : జుగాష్‌విలి

డి.టి.పి. : కవిత, హైదరాబాద్
ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, హైదరాబాదు- 20

ప్రతులకు:

నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైద్రాబాద్
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైద్రాబాద్
నవయుగ బుక్‌హౌస్, సుల్తాన్‌బజార్, హైద్రాబాద్
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు
తెలుగుబుక్ హౌస్, కాచిగూడ, హైద్రాబాద్

**వెల : 30 రూపాయలు**

## అంకితం

నా యాభయ్యవ ఏట మా తొలిచూపులు
గత పదేళ్ళుగా పదేళ్ళ పిల్లల్లా మా సావాసం
ఎడతెగని ముచ్చట్లు
అంతూ పొంతూ అర్థం పర్థం లేని నవ్వులు
కొత్త పుస్తకాలు చదివి ఎగిరి గంతెయ్యటాలు
పాత పుస్తకాల మీద వదలని వ్యామోహాలు
ఇవన్నీ ఈ వయసులో
ప్రమీలతోనే సాధ్యం.
నా సావాసగత్తె **ప్రమీలా హరగోపాల్**కి
ఈ పుస్తకంలోని
మరో ఐదుగురు అపురూపమైన నేస్తాలను కానుకగా....

**ఓల్గా**

## కథా క్రమం


- నా మాట – ఓల్గా .................................................. 07
- ఇతిహాసపు వెలుతురు కోణాలు – డా॥ యు.వింధ్య, డా॥ యు. సుధాకర్...... 11
- సమాగమం.......................................................... 17
- మృణ్మయనాదం .................................................... 28
- సైకతకుంభం....................................................... 45
- విముక్త.............................................................. 62
- బంధితుడు.......................................................... 76
- 'రాజ్య' + 'అధికార' ఆవరణలో రాముడు– మహిళావరణంలో సీత.... సీతారాం...... 86


## నా మాట

ఈ సంకలనంలో కథలు రామాయణ కథా నేపథ్యంలో సీత సూత్రధారిగా నడిచే కథలు. పురాణ కథలను కొత్త దృక్కోణం నుంచి తిరగ రాయటమనే పని మొదలు పెట్టింది బహుశ గత శతాబ్దిలో త్రిపురనేని రామస్వామి చౌదరిగారేమో. రాముడు బ్రాహ్మణాధిపత్యానికి లోనై వారి ఫిర్యాదు మేరకు శంబూకుడనే శూద్ర తపస్విని వధిస్తాడు. రామాయణంలో అదొక ధర్మ రక్షణ కార్యంలా రాయబడింది. అది ఎంత అన్యాయమో తపస్సు చేయటానికి కులానికి ఏమి సంబంధమో ఆలోచించమంటూ శంబూక వధలో బ్రాహ్మణాధిపత్యాన్ని వెల్లడి చేశారు త్రిపురనేని.కాలం మారుతుంటుంది. దానితోపాటు కాలానుగుణంగా ధర్మాలు, సంప్రదాయాలు, ఆచారాలు మారతాయి. ఒకప్పటి ధర్మాలు ఇప్పుడు అర్ధరహితమైనవి, అన్యాయమైనవి అవుతాయని చెప్పటానికి అప్పటి నుంచి ఇప్పటి వరకూ చాలా మంది పురాణ కథలను తిరగరాస్తున్నారు. పునర్ వ్యాఖ్యానిస్తున్నారు. చలంగారు మరికొంత ముందుకు వెళ్ళి రేషనల్‌గా ఆలోచించి పురాణ పాత్రలను చాలా రకాలుగా మలచుకున్నారు. అగ్ని పరిక్ష కోరిన రాముడి కంటే తనకోసం సర్వనాశనం కొని తెచ్చుకున్న రావణుడే నిజమైన ప్రేమికుడని సీత రావణుని చితిలో దూకినట్లు రాశారు. హరిశ్చంద్రుని సత్యవ్రతాన్ని, ప్రహ్లాదుని విష్ణుభక్తిని, కుచేలుని సంతానాన్ని చాలా హాస్యంగా చూపిస్తూ అనేక కథలు, నాటికలు, నాటకాలు రాశారు. పురూరవ, శశాంక వంటి నాటకాలతో పురాణ పాత్రల ద్వారా ఇప్పటి నీతులపై లోకరీతులపై విమర్శ పెడుతూ మానవుడు ఈ సంకుచిత సరిహద్దులను, అహంభావాలనూ దాటాలనే స్పృహ

కలిగించారు చలం. అందమైన అశోకవనాన్ని దహనం చేయటానికి ఎంత కాఠిన్యం కావాలా అని ఆశ్చర్యపోతారు కొ.కు. అశోకవనం కథలో. జాంబవంతుడి కలలో జాంబవంతుడిలో విప్లవ ఆలోచనలను ప్రవేశపెట్టారాయన.

తాము చెప్పదల్చుకున్న విషయాలకు పురాణ పాత్రలను, కథలను వాడుకోవటం తెలుగు సాహిత్యంలో ఎప్పటినుంచో ఉందని చెప్పేందుకు ఈ ఉదాహరణలు చాలనుకుంటాను. ముందే తెలిసిన పాత్రలు గనుక పాత్రల పరిచయం చేసే శ్రమ రచయితకుండదు. విషయం మీద కేంద్రీకరించవచ్చు. నేను ఈ కథలలో ముందు 'సమాగమం' రాశాను. ఆ కథ రాయటానికి నన్ను ప్రేరేపించిన కారణం ఉంది. నేను రాసిన 'యుద్ధము- శాంతి' నృత్య రూపకంలో సీత, శూర్పణఖలు రామ రావణ యుద్ధానికి తాము కారకులం కాదని చెబుతూ

"ఆర్య సామ్రాజ్య విస్తరణ కాంక్ష
రగిలించిన రామ రావణ రణం
అది ఆర్యద్రావిడ సంకుల సమరం
ఆడవాళ్ళూ పావులైనా విధం"

అని పాడుతూ కలిసి నృత్యం చేస్తారు. ముందు సీత, శూర్పణఖ, విడివిడిగా తాము వనవాస ప్రియులమనీ, శాంతి ప్రియులమనీ, సౌందర్యారాధకులమనీ, కానీ తమకు అవమానాలు, అనుమానాలు, పరాభవాలు తప్పలేదని చెబుతూ నృత్యం చేస్తారు. తర్వాత ఇద్దరూ కలిసి పై గీతానికి నృత్యం చేస్తారు. దీనిని ప్రేక్షకులందరూ ఎంతో మెచ్చుకున్నారు. శూర్పణఖ పాత్రకు చాలా ప్రశంసలు వచ్చాయి. ఐతే కొందరికి సందేహాలూ వచ్చాయి. ముందు, ముఖ్యంగా అవి నర్తకులకే వచ్చాయి. వారికి తెలిసిన శూర్పణఖ రాక్షసి. నేను చిత్రించిన శూర్పణఖ రూపసి. సౌందర్యారాధనే జీవన సూత్రం, ప్రేమమయిని స్నేహమయిని అని చెప్పుకుంటుంది. దీనికి డాన్స్ చెయ్యటంలో వాళ్ళు సందేహంలో పడ్డారు. వాళ్ళకు శూర్పణఖ ద్రావిడ స్త్రీ అని, వారి ఆచారాలు వ్యవహారాలు ఆర్యుల కంటే భిన్నమనీ, పురాణాలలో ద్రావిడులను రాక్షసులుగా చిత్రించారనీ, ఆ వివరాలు చెబితే సమాధానపడ్డారు. శూర్పణఖ పాత్రను రక్తి కట్టించారు. ఇది దూరదర్శన్‌లో ప్రసారం చేసేటపుడు సమస్య వచ్చింది. శూర్పణఖను రాక్షసిగా తప్ప వాళ్ళు చూడలేకపోయారు. సీత, ద్రౌపదుల వేదనను అర్థం చేసుకోవటం వారికి అలవాటు. శూర్పణఖను వారి సరసన ఎలా చేర్చటం? అసలు శూర్పణఖ ఏం బాధపడింది? పరపురుషుని కోరి శిక్షించబడింది. అంతేగాని, ఆమెకేం వేదన? అసలు సీత శూర్పణఖలు శత్రువులు కదా, కలిసి నృత్యం చేయటమేమిటి? ఇలా ప్రశ్నలు సంధించారు. మా సమాధానాలతో సంతృప్తి పడలేదు. శూర్పణఖ పాత్రను సెన్సార్ చేసి ప్రసారం చేశారు.

అప్పుడు నాకు శూర్పణఖ వేదన మీద కథ రాయాలనిపించింది. సీతా శూర్పణఖలు స్నేహంగా ఎందుకుండకూడదని కథ రాయాలనిపించింది. ఫలితమే 'సమాగమం' కథ. ఈ కథలో శూర్పణఖలో ఒక లోతైన చూపుని సీత గమనించింది. శూర్పణఖ సాధికారతను, దానికోసం ఆమె తనతో తాను యుద్ధం చేసిన తీరుని సీత గమనించింది.

ఈ కథ రాసిన తర్వాత నాకు సీత పాత్ర మీద చాలా ప్రేమ కలిగింది. రాముడిని ఎంతో ప్రేమించిన సీత, రాముడి ప్రేమను ఎంతో పొందిన సీత ఆ రాముని వల్లనే అవమానాలూ తిరస్కారాలూ భరించాల్సి వచ్చింది. ప్రేమానురాగాలతో రాముని ఒడిలో ఒదిగే సీత, రాముని వెనక ఆయనను అనుసరించే సీత- ఆయనను కాదని పిల్లలను కూడా ఒదిలి తన దారి తాను చూసుకుంది. ఆమె అనుభవాలు ఆమెను ఆ గమ్యం వైపు మళ్ళించాయి. ఐతే సీత చేసిన ఈ ప్రయాణంలో ఆమెకు తోడైన స్త్రీలు ఉండే ఉంటారనిపించింది. సీత రాముని కాదని వెళ్ళటమంటే ఆమె తనతో తను ఎంతో యుద్ధం చేసి ఉండాలి. కేవలం కోపంతో రాముని నుంచి వేరవటం జరగని పని. కోపం, ద్వేషం మనిషిని మనిషితో మరింత దగ్గరగా ముడి వేస్తాయని మానసిక విశ్లేషకులు చెబుతుంటారు. ప్రేమకంటే ఎక్కువగా ఆగ్రహం, ద్వేషం మనుషులను పెనవేస్తుంది. విముక్తం చెయ్యదు. కాబట్టి సీత కేవలం కోపంతో వెళ్ళలేదు. ఒక పరిణిత మనస్సుతోనే వెళ్ళింది. ఆ పరిణితి ఆమెకు లోకానుభవం ద్వారా కూడా వచ్చి ఉండవచ్చుననిపించింది. ఆమెకా శక్తి బయటనుంచి కూడ అంది, అది అంతశ్శక్తిగా మారి ఉండాలనిపించింది. ఆమె కంటే ముందు లోకం చేత, తమ కుటుంబాల చేత భర్తల చేత అనేక అవమానాలు, శాపాలూ, తిరస్కారాలు పొందిన, నిర్లక్ష్యానికి గురైన స్త్రీలున్నారు- రామాయణంలోనే ఉన్నారు. ముందు నాకు అహల్య గుర్తొచ్చింది. ఆ అహల్య, సీతా కలిస్తే ఎలా ఉంటుందని రాసిన కథ 'మృణ్మయనాదం'.

రేణుక, ఊర్మిళ- వీళ్ళనుభవించినదీ తక్కువ కాదు. వీళ్ళు తమ అనుభవాలను సీతతో పంచుకుంటే, ఆ అనుభవాల వల్ల వచ్చిన జ్ఞానాన్ని, బలాన్ని, వివేకాన్ని సీతతో పంచుకుంటే- సీతకు మరింత బలం చేకూరుతుందేమో.

స్త్రీల మధ్య ఈ సహకారం నాకు చాలా ప్రియమైన భావన.

ఆ భావనలో పూర్తిగా లీనమై రాసిన కథలివి'

ఈ కథలు వర్తమాన సమాజంలో స్త్రీల వేదనలకు ప్రాతినిధ్యం వహించే కథలు కూడా. ఇవాళ్టి సమాజంలో అనేక ఆంక్షలకూ అవమానాలకూ హింసలకూ గురై వాటినధిగమించి లేస్తున్న స్త్రీలు కొందరైతే, వాటిలోనే కూరుకుపోయి వాటిని దాటలేక, దాటాలని తెలియక, నానా యాతనలు పడుతున్న స్త్రీలెందరో– తమను హింసించే భర్తల నుండి విముక్తం కావాలనే స్పృహ లేకుండా వారిని ద్వేషిస్తూనే, అసహ్యించుకుంటూనే వారిని గట్టిగా పట్టుకునే స్త్రీలు – ద్వేషంతో తమను తాము హింసించుకోవటం అలవాటైన స్త్రీలు–

ఆ స్త్రీల కోసం ఈ కథలు.

'నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి' అన్నాడు రామదాసు.

ఈ కథలలోనీ సీత ఎవరితో చెప్పే పని లేకుండా తనే మనల్ని బ్రోవగలదని నా నమ్మకం.

'బ్రోచేవారెవరురా' అన్నాడు త్యాగయ్య

'మనల్ని మనమే'– అనే నమ్మకాన్ని ఈ కథలు మనకు కలిగిస్తాయని నా ఆశ.

ఈ నాలుగు కథలతో ఐదుగురు స్త్రీలను ఆప్తమిత్రులుగా చేసుకున్నాను.

సీత, శూర్పణఖ, అహల్య, రేణుక, ఊర్మిళ.

ఈ నా స్నేహితురాళ్ళు నాతోటి స్త్రీలకు బలాన్నీ ధైర్యాన్నీ వివేకాన్నీ ఇవ్వగలరని నా నమ్మకం.

ఓల్గా



## ఇతిహాసపు వెలుతురు కోణాలు

"పురాణాలలో చిరస్థాయిగా నిలిచిపోయే ఒక సమ్మోహక శక్తి ఉంటుంది; ఎందుచేతనంటే సమస్త మానవజాతి యొక్క సమిష్టి బాల్యం వాటిల్లో ఇమిడి ఉంటుంది గనుక" అన్నాడు మార్క్సు. అయితే "ఈ సమ్మోహక శక్తి ఎక్కడ్నించి వస్తుంది.?" అని ప్రశ్నిస్తే, పౌరాణిక సంఘటనల కన్నా కూడా ప్రధానంగా– ఆయా పురాణ గాథల్లోని పాత్రల సంక్లిష్టత, సంపూర్ణత, ఉదాత్తత, సర్వకాలీనత, విశ్వజనీయత–వీటినించే అని జవాబు చెప్పుకోవచ్చు. రాముడు, భీముడు, కర్ణుడు, అభిమన్యుడు, ద్రౌపది, సీత... వీళ్ళంతా సజీవంగా, శాశ్వతంగా పండిత పామర హృదయాల్లో నిలిచిపోయే వ్యక్తులు.

అయితే పౌరాణిక పాత్రల ఉదాత్తత, ఎదుగుదల, సంపూర్ణత, ఆయా పరిస్థితుల్లో వాళ్ళు చేసిన సంఘర్షణల ఫలితాలే. చరిత్రనీ, పురాణాల్నీ కలగా పులగం చేసి, గందరగోళం సృష్టించే కొంతమంది వ్యక్తులు, ఈ సంఘర్షణని దాటవేసి పురాణాలని సమతుల్యానికి ఆదర్శాలుగా చిత్రింపబూనుతారు. అంతేగాని ఆధునికతవైపు, సత్యాన్వేషణవైపు పాఠకులని తీసుకెళ్ళరు. మహా అయితే "మంచి", "చెడు" లమధ్య నిరంతరం జరిగే పోరాటాలుగా పౌరాణిక గాథల్ని స్తుతిస్తారు తప్ప – దోపిడీకీ, పెత్తనానికీ, అన్యాయానికి, వ్యవస్థీకృత ఆధిపత్యానికి వ్యతిరేకంగా పౌరాణిక పాత్రలు చేసే సంఘర్షణల్ని ఎత్తి చూపరు. పరిస్థితుల్ని 'కర్మ' గానూ ప్రవర్తనని 'ధర్మం' గానూ సరళీకృతం చేసి క్షత్రియ ధర్మం, అలాగే ఇతర కులాలు ఆచరించాల్సిన ధర్మాలు, స్త్రీలకు కేటాయించిన పాతివ్రత్యం– వీటన్నింటినీ కూడా ధర్మ బద్ధ సమతుల్యం నుండి వచ్చిన ఆదేశిక సూత్రాలుగా ప్రచారం చేస్తారు. ఈ ధోరణి ఎటుదారి తీస్తుందో తెలుస్తూనే ఉంది. ధర్మ సంరక్షణ యధాస్థితి వాదం అయితే న్యాయపోరాటం ప్రగతిశీల తిరుగుబాటు.

పైన చెప్పిన రెండు ప్రధాన పరస్పర విరుద్ధ వాదనలే కాక "వేదాల్లోనే అన్నీ ఉన్నాయష" అనే మరో ధోరణి కూడా ఇటీవలి కాలంలో ప్రబలంగా కనబడుతున్నది. పౌరాణిక పాత్రల ఉదాత్తతని ప్రశంసించేందుకు, వీరు ఉత్సాహం చూపుతారు గాని, దోపిడికీ, పెత్తనానికి బలైన ఏ సమూహమైనా – అది వ్యక్తులుగా మొదలు పెట్టి సామూహికంగా చేసే పోరాటాలే, గతాన్ని వర్తమానంతో, వర్తమానాన్ని భవిష్యత్తుతో సంధించే అంతస్సూత్రాలని వీరు గుర్తించరు. ఒకసారి ఈ అంతస్సూత్రాల్ని గుర్తించాక ప్రతి జన సమూహమూ తన యొక్క నిర్దిష్ట చరిత్రని నిర్మించుకుంటుంది. మన వర్తమాన చైతన్యమే మన గతాన్ని ఆవిష్కరిస్తుంది గనక ఇవాళ అందరూ తమతమ చరిత్రల్ని నిర్మించుకుంటున్నారు. దళితులు, స్త్రీలూ, గిరిజనులూ, ఇతర పీడితులూ తమపై రుద్దబడిన ఏకశిలా సదృశ్యమైన చరిత్రని తృణీకరిస్తున్నారు. చరిత్రకీ పురాణాలకీ మధ్య ఉండే సంబంధాల్ని, తేడాల్ని గుర్తిస్తున్నారు. గతాన్ని తిరిగి పరిశీలిస్తున్నారు.

ధర్మరక్షకులు పురాణాల్ని ప్రామాణికంగా చూపించి తమ భావజాలాన్ని సుస్థాపితం చెయ్యబూనుతారు. ఇందుకు భిన్నంగా పౌరాణిక పాత్రల సంఘర్షణల్ని తమ ఇతివృత్తాలుగా చేసుకుంటూ తమ గొంతుని వినిపిస్తున్న వాళ్ళల్లో దళిత, స్త్రీవాద రచయితులూ, కళాకారులూ ప్రథమ శ్రేణిలో ఉండడం గమనార్హం.

పురుషులు సృష్టిస్తూవస్తోన్న యుద్ధాలకి, హింసకీ ప్రధాన బాధితులు స్త్రీలు, అస్తవ్యస్తమయ్యే వారి జీవితాలూ అనే విశ్వజనీన సూత్రాన్ని తన 'యుద్ధము– శాంతి' నృత్యనాటికలో ఓల్గా చేజిక్కించుకుంది. దాని కొనసాగింపే ఈ నాలుగు కథలు. ఆధునిక జీవన సంక్లిష్టతని అర్థం చేసుకోవడానికి పురాణ పాత్రలు తోడ్పడతాయంటే ఒకింత ఆశ్చర్యకరంగానే ఉంటుంది. కాని నిజం అదే. అందరి బాధితుల్లాగే కార్యకారణ సంబంధాల్ని వెతుక్కొనే ప్రయత్నం, ఆత్మ పరిశోధన, మానవ సంబంధాల పునర్నిర్వచనం, చైతన్య పూరితమైన ఆచరణ– ఇవన్నీ పౌరాణిక స్త్రీ పాత్రల సంఘర్షణలోనూ, ఎదుగుదలలోనూ మనకు స్పష్టంగా కనిపిస్తాయి.

పురాణస్త్రీల ప్రపంచంలో యుద్ధ వాతావరణం తక్కువగానూ– ఆత్మశోధన హెచ్చుగానూ కనిపిస్తాయి. హింస, యుద్ధాల పట్ల ఏవగింపు తోనూ, ప్రకృతి, జీవరాశి పట్ల ప్రేమతోనూ పౌరాణిక స్త్రీ పాత్రల సంఘర్షణ, ఆత్మపరిశీలన, నూతన చైతన్యం విస్తరించాయి. సమిష్టికార్యాచరణ సాధ్యం కాని దశలో భావజాల విజయాల్ని సాధించారీ స్త్రీలూ, ఇతర బాధిత సమూహాలూను. బహుశా ఈనేపథ్యంతో పరికిస్తే ఈ పుస్తకంలోని ఆధునిక పౌరాణిక గాథలూ, అందులోని స్త్రీ పాత్రల సంఘర్షణ నుండి ఉదయించిన చైతన్యం, మనకు ఇట్టే అర్థం అవుతాయి. అర్థం అవుతూనే ఇబ్బంది పెడతాయి. గతకాలపు గాథలన్నీ ఇవాళ్టి సంఘర్షణల రూపంలో ఎదురై మనకు పురాణ కాలక్షేపం లేకుండా చేస్తాయి.



❊ ❊ ❊

పురాణ పురుషులు సృష్టించే యుద్ధాలు, విధ్వంసం, హింస– వీటినుండి తేరుకొని నిలదొక్కుకోవడానికి స్త్రీలు అంతర్మథనానికి లోనయ్యారనడానికీ చివరికి భావజాల పరంగా విజేత లయ్యారనడానికీ 'సమాగమం' కథలో శూర్పణఖ మాటల్నే ఉదాహరణగా తీసుకోవచ్చు.

'....మళ్ళీ సౌందర్యాన్ని ప్రేమించటానికీ రూప, అరూపాల అసలు సారాంశాన్ని కనుగొనటానికీ నాతోనేను పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. ఆ యుద్ధంలో నాకు సహకరించినది ఈ అనంత ప్రకృతి" అంటుంది శూర్పణఖ. ఇది విని తన అగ్ని పరీక్షకంటే శూర్పణఖ గురైన పరీక్ష తక్కువది కాదు అని సీత అనుకున్నప్పుడు – ఒకే పురుషుడి కోసం తపించిన ఇద్దరి స్త్రీల మధ్య ఉండాల్సిన అసూయ మచ్చుకైనా లేకపోగా సహబాధితుల మధ్య చిగురించే స్నేహం, బంధం గోచరిస్తాయి. సీత, శూర్పణఖల మధ్య ఫెమినిస్ట్ సిస్టర్‌హుడ్‌ని ప్రతిపాదించడం ఒక సాహసం. అయితే ఇది సహజసిద్ధమైన పరిణామంగా, ప్రకృతి ఆశీస్సులతో మొలకెత్తిన స్నేహంగా గోచరిస్తుంది మనకీ కథలో. రాజ్యానికీ అరణ్యానికీ మధ్య ఒక భయంకరమైన అగాధం, వైరుధ్యం ఉన్నాయని శూర్పణఖ అప్పుడే పసిగట్టింది. రాజ్యం నుండి వేరుపడి అరణ్యాన్నీ, ప్రకృతినీ కోరుకోవడంలో సీత, శూర్పణఖా దగ్గరయ్యారు. రాజ్యాధిపతులైనప్పటికీ అరణ్యానికి తోవ మర్చిపోవద్దని లవకుశులను చివరిలో హెచ్చరిస్తుంది భూపుత్రి.

"ఎవరి సత్యం వారిది" అని గ్రహించిన అహల్య, "సత్యాసత్యాలు నిర్ణయించగల శక్తి ఈ ప్రపంచంలో ఎవరికైనా ఉందా?" అంటూ నిలదీస్తుంది 'మృణ్మయనాదం' కథలో. అధికారానికి లోబడి ఉన్నంత కాలం ఏం చేసినా ప్రాయశ్చిత్తం, పరిష్కారం ఉంటాయిగాని మొత్తం అధికారాన్నే ప్రశ్నిస్తే, దాని మూలాల్ని నిలదీస్తే మాత్రం ఎవరూ సహించరు. అక్కడే వస్తుంది పేచీ. తన అనుభవంలోని తప్పొప్పులను కుండబద్దలు కొట్టినట్లు చెప్పిన అహల్య, "నేనివ్వనంతవరకూ ఎవరూ నామీద అధికారాన్ని పొందలేరు" అని స్పష్టం చేస్తుంది.

"విచారణకు అంగీకరించకు. అధికారానికి లొంగకు" అని ఒక భవిష్య వాణిగా సీతను దీవిస్తుంది. పాతివ్రత్యంలో, మాతృత్వంలో ఉండే తమ అహాన్ని అధిగమించి

సత్యాన్వేషణకు పూనుకోవాలనీ భూమిపుత్రికి అహల్య ఆనాడు చేసిన సూచనలో నేటికీ ప్రతిధ్వనించే మృణ్మయనాదం నిక్షిప్తమై ఉంది. "చివరికి ఈ విశ్వమంతా నాదే" అని తెలుసుకుంటుంది జానకి. ఆమె ప్రపంచం భర్త, పిల్లల వద్దనే ఆగిపోకుండా అద్భుతంగా విస్తరిస్తుంది.

"సైకత కుంభం"–సగం తెగిన శిరస్సుతో, చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతూ ఎంతో మానసిక వ్యథకు గురైన రేణుక కథ. ఆమెకు అంతవరకూ సర్వస్వంగా ఉండిన పాతివ్రత్యం, మాతృత్వం ఒక్క వేటుతో సర్వనాశనమయ్యాయి. రేణుక మదిలో మౌలికమైన ప్రశ్నలు తలెత్తాయి. (ధర్మం మాదిరిగా కాకుండా) సత్యం అనుభవ పూర్వకంగా తెలుస్తుందనీ, అందరి సత్యం ఒక్కటే కాదనీ, జీవితానుభవం పెరుగుతున్న కొద్దీ సత్యం మారుతూ వస్తుందని రేణుక తెలుసుకుంటుంది. ఇదే విషయం ఆమె సీతకు చెప్తుంది గాని స్వానుభవం ద్వారానే రేణుక మాటల్లోని ఆంతర్యాన్ని పూర్తిగా గ్రహించగలిగింది సీత.

సీత రాముడి తోడు లేకుండానే లవకుశులను కని, పెంచింది. ఆ క్రమంలోనే అటు పాతివ్రత్యం మీదా, ఇటు మాతృత్వం మీదా సీతకు ఎలాంటి భ్రమలూ లేకుండా తొలగి పోయాయి. లవకుశులు ఎప్పటికీ క్షత్రియపుత్రులే. రాజ్యాన్ని ఏలడమే వాళ్ళ ధ్యేయం. రఘువంశోద్ధరణే వారి ధర్మం.

అధికారాన్ని ప్రశ్నించే పీడితులు, బాధితులు, సంఘర్షించి చివరికి తామే అధికారాన్ని చేజిక్కించుకున్నాక ఏమవుతుంది? దురదృష్టవశాత్తు వాళ్ళ స్వరూప స్వభావాలు మారిపోతాయి. అధికార దాహం, అభద్రత, నిరంకుశ అప్రజాస్వామిక ధోరణులు, అవినీతి... ఇవన్నీ మళ్ళీ చోటు చేసుకుంటాయి. ఈ మేరకి ప్రపంచవ్యాప్తంగా పెను మార్పుల్ని కోరుకొనే శక్తులు (కమ్యూనిస్టు పార్టీలతో సహా) పూర్తిగా విఫలమయ్యాయి. ఇక స్త్రీలు, దళితులు, ఇతరులూ ప్రత్యామ్నాయ విలువల్నీ ఆచరణనీ ప్రతిపాదించ గలుగుతారా– లేక చరిత్ర విధించిన చక్ర వలయంలోనే ఇరుక్కుంటారా? ఈ నిరాశాజనకమైన వాస్తవ పరిస్థితుల్ని ఆకళింపు చేసుకోవాలంటే– అధికారం యొక్క స్వభావాన్ని, మానవనైజాన్ని అర్థం చేసుకోవాలి. "విముక్త"లో సీతారాములతో బాటు లక్ష్మణుడు కూడా వెళ్లిపోయాక, నిర్విరామంగా పధ్నాలుగేళ్ళ పాటు చేసిన సత్యాన్వేషణలో, తపస్సులో ఊర్మిళాదేవి తెలుసుకున్న గొప్ప విషయం ఇదే. "అధికారాన్ని తీసుకో. అధికారాన్ని ఒదులుకో. అప్పుడు నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు" అని అత్యంత సరళమైన భాషలో ఈ మహాసత్యాన్ని సీతాదేవికి తెలియజేస్తుంది ఊర్మిళ "విముక్త" కథలో. అయితే (ఒక్క గాంధీజీని మినహాయిస్తే) అధికారాన్ని



ఒదులుకొనేందుకు ఏ ఒక్కరూ సిద్ధంగా ఉన్నట్లు తోచదు. ఏది ఏమైనా సంఘర్షణానంతర దశని, అధికారపు అసలు రూపాన్ని వివరించే గొప్ప కథ ఇది.

* * *

ఓల్గా తన గురించి తాను రాజకీయ కథకురాలుగానే చెప్పుకుంటుంది. అందుచేత పురాణ పాత్రల్ని ఇలా ఎందుకు వ్యాఖ్యానించావు? మరో విధంగా ఎందుకు రాయలేదు? అని ఆమెని నిలదీయ బూనడంలో అర్థం లేదు. ఆమె ఏ రాజకీయ ప్రయోజనాల్ని ఆశించి ఈ ప్రయోగం చేసిందో వాటిని ఎంతో కళాత్మకంగా, సృజనాత్మకంగా సాధించింది అనడంలో ఎట్టి సందేహములేదు. మార్క్సు చెప్పిన సమిష్టి బాల్యం, దాని మూలంగా పురాణాలకు ఏర్పడే సమ్మోహక శక్తి వెనక– బాల్యదశకి చెందిన సరళత్వం, అమాయకత్వం, కృత్రిమంగా ఉండకపోవడం– ఇవన్నీ ఉన్నాయి. "బాల్యపు అనుభవాల్ని కావాల్సినప్పుడల్లా స్మరించడమే ప్రతిభ" అన్నాట్ట బోదిలేర్.

మనకింకా బలీయంగా ఉన్న భూస్వామ్య, అప్రజాస్వామిక, అశాస్త్రీయ వ్యవస్థలో సాంఘికం, జానపదంగానూ, జానపదం– పౌరాణికంగానూ ఇట్టే రూపాంతరం చెందుతాయి. బతికుండగానే విగ్రహాలూ, గుళ్ళూ ఏర్పడతాయి. అయితే ఈ క్రమాన్ని, ప్రవాహాన్ని, వ్యతిరేక దిశలోకి మళ్ళించడానికి సృజనాత్మకతతో బాటు సాహసం కావాలి. ఈ రెండూ ఓల్గా చేసిన, చేస్తున్న ప్రయోగాల్లో పుష్కలంగా ఉన్నాయి. ఈ కథలు చదివినప్పుడు మనకి ధర్మం వేరు, న్యాయం వేరు అనేది స్పష్టమౌతుంది. న్యాయం ఎవరి పక్షాన ఉన్నదీ బోధపడుతుంది. పురాణపురుషులు ధర్మం పక్షాన నిలబడ్డ వాళ్ళయితే, స్త్రీలు అన్యాయాన్ని పౌరాణిక యుగాలనుండీ నేటి వరకూ కూడా ఎదిరించిన వాళ్ళుగా అగుపడతారు. సంక్షోభం, సంఘర్షణ, చైతన్యం, ప్రయోగం ఇవే ఓల్గా ఆవిష్కరించిన ఇతిహాసపు వెలుతురు కోణాలు. ప్రశ్నించడం, అధికారాన్ని సవాలు చెయ్యడం, తిరగబడడం– ఇవేవీ కూడా పాశ్చాత్య ధోరణులూ కావు, బూర్జువా పోకడలూ కావు. పురాణాలంత పాతవి, అధికార పీఠాలకు కంపరం కలిగేటంత కొత్తవి. అందరికీ తెలిసిన కథలతోనే మొదలు పెట్టి, చీకట్లో కాసేపు మీ చెయ్యి పట్టుకొని, అడవిలోకి నడిపించి, ఆ తరవాత కాస్తంత మసక వెలుతురు కనబడుతుంటే మిమ్మల్ని మీదారిన వదిలేసి చక్కా పోతుంది ఓల్గా, జాగ్రత్త!

తెలిసిన విషయాలతో మొదలు పెట్టి తెలియని విషయాలవైపు మనం వేసే తప్పటడుగులకు చేయూతగా ఏ కళాకారులైనా చేయగలిగేది అంత మాత్రమే. ఎవరి మార్గాన్ని, సత్యాన్ని వాళ్ళే వెతుక్కోవాలి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=287**